# సూత్రధారుడి కల

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆ ఉదయమే రైలు ప్రయాణం చేసి ఇంటికి తిరిగివొచ్చాడు ఆనంద్. రైలు గంట లేటు. ఏ.సి, స్లీపర్‌లో ప్రయాణం చెయ్యడం ఆపాటి అలశ్యాన్ని అంతగా గమనించనక్కరలేకుండా చేసింది. తానైతే సెకండ్‌క్లాసులోనే వొచ్చి ఉండేవాడు. కాని బావమరిది కామేశ్వర్ తన టికెట్ కొని తెచ్చేడు. డబ్బు ఇచ్చేస్తానని ఆనంద్ ఎంత పట్టుపట్టినా అతను వినిపించుకోలేదు. అదీ ఒకందుకు మంచిదే అయింది. టికెట్ ఖరీదుకి పదిరూపాయలు తక్కువ ఉంది పర్సులో. ఆ మాట రైలెక్కాక తెలిసింది.

అతన్ని చూసి అమ్మ "కోడలేదిరా" అంది.

"మరో వారం రోజులు పోయాక వస్తుందిలే" అన్నాడు ఆనంద్. నిన్న ఇంకో నాలుగ్గంటల్లో ప్రయాణం అనగా విజయ వచ్చి ప్రార్థనగా అడిగింది. తనని మరో వారం రోజులు ఉండనిమ్మని. వాళ్ళ నాన్నకి వొంట్లో బాగు రేదట.

"నువ్వు లేకపోతే నా కక్కడ తోచదు విజయా!" అన్నాడు ఆనంద్.

నెలరోజుల కిందట ఆమె ఎవరో తాను ఎవరో! కాని ఈ కొద్ది రోజులలోనూ ఆమె తనకి సర్వస్వమూ అయిపోయింది. ఆ మాట ఆనంద్‌నీ ఆశ్చర్యపరిచింది. మొదటిలో ఆ పెళ్ళి కుదురుతుందనే అనుకోలేదు. తనని ఉద్యోగం వదిలి వొచ్చీమని 'అక్కడే' ఉండి



బొమ్మనీ వాళ్ళు సూచించారు. కావలసినంత కట్నంగూడా ఇస్తామన్నారు. కాని అమ్మనీ నాన్ననీ వొదిలి వెళ్ళాలని అక్కడ ఇల్లరికం ఉండాలనీ అతనికి అనిపించలేదు. ఆనంద్ చాలా ఆశయాల మనిషి. అతనిక కట్నం అనే మాట కూడా వినిపించడానికి వీల్లేదు. అందుకే అమ్మాయి నచ్చింది గాని ఆ షరతులు నచ్చలేదని స్పష్టం చేశాడు. కట్నం ప్రసక్తి రావడానికి వీలులేదన్నాడు.

ఆనంద్ అందగాడు. దానికి తోడు చేతిలో ఒక డిగ్రీ ఉంది. అన్నిటినీ మించి చాలా మంచి ప్రవర్తన ఉన్న మనిషి. తన సూత్రాలని అతను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉన్నాడు. అందుకే అతను తన పెళ్ళివిషయంలో రాజీపడలేదు. చివరికి వాళ్ళే సరి అన్నారు.

పెళ్ళి అయి లాంఛనాలన్నీ ముగిసి విజయ అతని ఇంటికి వొచ్చేసింది. ఆమె ఇల్లు చాలా పెద్దది. అన్ని హంగులూ ఉన్నాయి. అన్నిటికీ నౌకర్లూ వాళ్ళు అతి భక్తిగా సిద్ధపడతారు.

ఆనంద్‌కి ముందర అనుమానం వేసింది విజయ తన సామాన్య జీవితంలో సర్దుబాటు చేసుకోగలదా అని! అతని ఇల్లు మరీ చిన్నది. ఉన్న ఒక్క పడకగదిలోనూ ఆమెతో సరదాగా నాలుగు మాటలు చెప్పడానికైనా వీలు లేదు. అమ్మానాన్న అవతల హాలులోనే పడుకుంటారు. వాళ్ళకి రాత్రి తొందరగా నిద్రరాదు. విజయకి సిగ్గెక్కువ. ఏమైనా అంటే వెంటనే సంజ్ఞ చేస్తుంది, వాళ్ళు వింటారని. కాని మొత్తంమీద ఆమె ఉన్న నాలుగురోజులూ బాగానే గడిపింది. తనకీ వంటరానందుకు చాలా బాధపడిపోయింది కూడాను. అమ్మ ఆమెని అభిమానంగా ఓదార్చడం ఆనంద్‌కి చాలా నచ్చింది. సంక్రాంతి పండగకని బావమరిది వొచ్చి వాళ్ళిద్దరినీ స్వయంగా తీసికెళ్ళేడు. అక్కడ అనుక్షణమూ విజయ తనని ఎంతో జాగ్రత్తగా చూసుకుంది. కామేశ్వర్ పరిహాసాలు చేసినా ఆమె కోపం తెచ్చుకొనేది. ఫర్వాలేదని ఆనంద్ అన్నా ఆమె అంగీకరించేది కాదు. ఈ రకం సేవలూ దాసదాసీ జనమూ ఆనంద్ తత్వానికి పడకపోయినా ఆమె బాధ పడుతుందన్న భయంతో అ సేవలని స్వీకరించేవాడు.

"ఎప్పుడు వొస్తుందిరా? కోడలిని వొదిలి ఎందు కొచ్చేశావూ?" అంది అమ్మ. నిన్న విజయ కోరిక మన్నించినప్పుడు అమ్మానాన్నా జ్ఞాపకం రానే లేదు.

"మామగారికి ఒంట్లో బాగులేదట. వారంరోజుల్లో వచ్చేస్తానంది" అన్నాడు ఆనంద్. ఇప్పుడు వెనక్కి చూస్తే ఆయన ఆరోగ్యంలో లోటు ఏమీ కనిపించలేదు. ఆ నల్లటికళ్ళు తనమీద కేంద్రీకరించి తియ్యగా విజయ తన అనుమతి అడుగుతూంటే తాను కాదనలేకపోయాడు. అంతే. ఆ క్షణంలో విజయ మీద ప్రేమ పొంగి పొరలినా ఇప్పుడు కోపం వొచ్చింది. ఆమె తనతో వొచ్చేసి ఉండవలసింది. అమ్మ ఆశాభంగం ఏమిటో ఆనంద్‌కి పూర్తిగా అర్థం కాలేదు. కాని అది తనకోసమేనని అతనికి తెలుసును.

త్వరగా స్నానాదులు ముగించి ఆఫీసుకి వెళ్ళడానికి తయారయాడు ఆనంద్. నాలుగు రోజులే అయినా విజయ తన బట్టలని గురించీ భోజనం గురించీ జాగ్రత్త తీసుకోవడం అతనికి తియ్యటి జ్ఞాపకంగా ఉంది! ఆమె అక్కడ లేకపోవడం ప్రతిక్షణమూ ఒక పెద్ద లోపంగా అనిపించింది. త్వరగా వొచ్చేస్తే బాగుండుననిపించింది. ఆ మాట ఎవరితోనైనా చెప్తే కొంత ఉపశమనం కలిగి ఉండేది కాని అమ్మతో చెప్పి లాభంలేదు. వేరే కారణాలవల్ల అయినా ఆమె కోరికా అదే కదా!

కంచం దగ్గర కూర్చుని భోజనం అయిందనిపించేడు.

"అదేమిట్రా ఏమీ తిననేలేదు?" అంది అమ్మ.

"ఆకలికొద్దీ తిన్నానులే" అన్నాడు ఆనంద్ సైకిలు తీసుకుంటూ. ఈ వారం పదిరోజులు సైకిలు బూజు పట్టింది. తొందరగా తుడిచి ఎక్కి బయలుదేరాడు. వీధి చివర ఎర్రదీపం చూసి ఆగేడు.

మొన్న విజయ తన ముఖంలో ముఖం పెట్టి "మీరు లేకపోతే నాకు తోచదండీ?" అంటూన్నప్పుడు ఆ నల్లటి కనుబొమల మధ్య ఎర్రటిబొట్టు ఆనంద్‌కి గుర్తు వొచ్చింది. వేడిగా నిట్టూర్చి అతను ముందుకు సాగాడు.



ఆఫీసుకి వెళ్ళేసరికి పదిదాటి రెండు నిమిషాలయింది. ఆనంద్‌కి తనమీద తనకే కోపం వొచ్చింది. అతను పది నిమిషాలు ఆలశ్యంగా వొచ్చినా అధికారులు అడగటానికి వీల్లేదు. కాని ఆ రకం దయాదాక్షిణ్యాలు సహించని తత్వం అతనిది.

ఆనంద్ రిజిస్టరులో సంతకంపెట్టి సీటుకు వెళ్ళి కూర్చున్నాడు. లేడీ టైపిస్ట్ ఒకామె తప్పితే ఆఫీసులో ఇంకెవరూ లేరు. ఆవిడ నెలరోజుల కిందటే ఉద్యోగంలో చేరింది. ఒకసారి ఆమెవంక చూశాడు ఆనంద్. విజయ ఈమెలాగ గ్రాడ్యుయేట్ కాదు. కాని ఆమెకి ఈమెకీ మిగిలిన అన్ని విషయాలలోనూ పోల్చడానికి ఏమీలేదు. ఈ టైపిస్టు పేరుకూడా తాను మరిచిపోయాడు! ఆమె ఆఫీసులో చేరిన రోజున అందరూ ఒకమాట గుర్తుచేశారు – అక్కడ పెళ్ళికాని అబ్బాయి ఒక్కడూ పెళ్ళికాని అమ్మాయి ఒకరూ ఉన్నారని. మిగిలిన వాళ్ళందరూ పెళ్ళి అయినవారే. అప్పటికే ఆనంద్ విజయని చూశాడు. ఆ సంగతి వారెవరికీ తెలీదు. అందరికీ ఒక గంభీరమైన చిరునవ్వుతో సమాధానం ఇచ్చి ఊరుకున్నాడు. మరో వారం రోజులకే శుభలేఖలు పంచిపెట్టడంతో అందరికీ నిరుత్సాహం కలిగింది.

అలాగ కలిగిన నిరుత్సాహం పోడానికి ఆఫీసునుంచి ఇద్దరు పెళ్ళికి రావడం కారణం అయింది.

“గొప్ప ఛాన్సు కొట్టేశావు బ్రదర్! మీ అత్తవారు ఇంత శ్రీమంతులని తెలీదు! చాలా లక్షలు ఉన్నవారుట” అన్నాడు పుండరీకాక్షుడు. ఆనంద్‌కి గర్వమూ బాధా ఒక్కసారే కలిగాయి. “నేను డబ్బుకి ఆశపడి పెళ్ళి చేసుకోవడంలేదు పుండరిగారూ!” అన్నాడు.

“ఆ అమ్మాయిని చూసి కళ్లు చెదిరితే మీ తప్పేమీ లేదు” అన్నాడు డేనియేల్ ఆ మాటకి సంతోషించినా తన వధువుని వాళ్ళంత పరీక్షించడమూ ఆనంద్‌కి ఇష్టం లేకపోయింది. చిరునవ్వుతో మాత్రం సమాధానం ఇచ్చి “భోజనం సరిగా చేశారా?” అన్నాడు.

“అంత తినకూడదనుకుంటూనే నాలుగురోజుల తిండి తిన్నాం. ఏం మరియాదలు! ఏమి వంటలు!” అన్నాడు పుండరీకాక్షుడు. “అవునవును” అన్నాడు డేనియల్.

వాళ్ళిద్దరే ముందర వొచ్చారు ఆఫీసుకి. అప్పటిదాకా టైపిస్టు అమ్మాయి ఏదో టైపు చేస్తోంది. ఆనంద్ తన టేబిల్ మీది ఫైళ్ళు చూసుకుంటున్నాడు. ఇద్దరూ అతన్ని చూసి “గుడ్ మాణింగ్ ఆనంద్! మీరు వొచ్చేశారా?” అన్నారు ఆశ్చర్యంగా.

“మరి? సెలవు ముగిసింది. రావొద్దా” అన్నాడు ఆనంద్.

“అంత త్వరగానా.” అన్నాడు డేనియల్.

“లేకపోతే అక్కడే కూర్చోమంటారా?” అన్నాడు ఆనంద్.

“ఇంద్రభవనంలా ఉంది ఇల్లు. అక్కడ కొంతకాలం ఉండిపోయినా ఆశ్చర్యపడనక్కరలేదు” అన్నాడు పుండరి.

“అలాటివి నా సూత్రాలకి విరుద్ధం” అన్నాడు ఆనంద్.

“అవునవును ఆనంద్! కాని న్యాయంగా ధర్మంగా లభించిన సుఖాన్ని అనుభవించడం ఏ సూత్రానికి వ్యతిరేకం!” అన్నాడు డేనియల్.

“నా సూత్రానికి. ధర్మం పుచ్చుకునే అలవాటు లేదు” అన్నాడు ఆనంద్. ఇంతలో మిగిలినవాళ్ళు వచ్చారు.

అందరూ అతనికి కంగ్రాట్స్ చెప్పి పార్టీ అడిగారు.

అలాగే అన్నాడు ఆనంద్.

“మామూలు పార్టీ కాదు. వెట్” అన్నాడు పుండరి.

“అది నా సూత్రానికి వ్యతిరేకం.” అన్నాడు ఆనంద్. అతనికి ఎవరూ ఎదురు చెప్పలేదు. ఆఫీసుకి వొచ్చేవాళ్ళ దగ్గర బీరూ బ్రాందీ సరేసరి టీ కూడా తీసుకోని మనస్తత్వం అతనిది అని అందరికీ తెలుసును.

“పెళ్ళి ఫొటోల ఆల్బమ్ ఏదీ?” అని అడిగారు.

చాలా ఆర్భాటంగా తయారుచేశారు ఆల్బం. ముందర ఆ కాపీని స్వీకరించకూడదనుకున్నాడు. కాని విజయ బలవంతం మీద పుచ్చుకున్నాడు. మంచిదయింది. ఆమె మాట విని తెచ్చి ఉండకపోతే పరువు పోను!

“రేపు సాయంత్రం పార్టీకి వొస్తారుగా. అప్పుడు చూపెడతాను. ఆఫీసులో అవన్నీ చూడడం ...” అన్నాడు ఆనంద్.

పదీ ఏభైకి సూపరెంటుగారు వొచ్చారు. అటెండెన్స్ రిజిస్టరు చూసి లాంఛనంగా ఒకసారి ముఖం చిట్లించాడు. “ఓహో! ఆనంద్ తిరిగి వొచ్చాడా?” అంటూ ఆయన అతన్ని పిలిచి కూర్చోపెట్టి తమలపాకులు నములుతూ “అన్నరోజుకి వొచ్చేస్తావనుకోలేదు ఆనంద్!” అన్నాడాయన.

“నా సంగతి మీకు తెలుసు కదా!” అన్నాడు ఆనంద్. సెలవు పెడితే అది ముగిసిన రోజుకి తిరిగిరావడమే కాని పొడిగించటం లాంటి పనులు చెయ్యడు ఆనంద్. అది అతని సూత్రం.

“నాకు తెలుసును. కాని...మీ మామగారు ఇంతా అంతా పలుకుబడి మనిషి కాదు ఆనంద్. పెళ్ళిలో అంతా చూశాను. ఎంక్వయిరీ చేశాను. అక్కడికి వెడితే నిన్న రానిస్తారనుకోలేదు మరి!” అన్నాడు సూపరెంటు.

"ఒకరి ఆదాయంమీదా ఆస్తిమీదా ఆధారపడటం నా సూత్రాలకి విరుద్ధం సార్!" అన్నాడు ఆనంద్.

"అవునవును ... కాని అమ్మాయి నీదయాక ఆమెవన్నీ నీవే కదా! నీవి నువ్వు అనుభవించడంలో సూత్ర విరుద్ధం ఏముంది?" అన్నాడు సూపరెంటు.

విజయ తనది అన్న భావం ఆనంద్ మనసులో మలయమారుతంలా మెదిలింది. ఆ ఆలోచన తియ్యగా ఉంది. బట్టతలా నల్లటి ముఖమూ ఎర్రటి కోటూతో ఉన్న చిన్న రాక్షసుడిలాగ ఉన్న ఈ సూపరెంటులోనించి అంత తియ్యటి భావన రావడం ఆనంద్‌కి ఆశ్చర్యంగా కనిపించింది.

పార్టీమాట చెప్పి ఆయనని ఆహ్వానించేడు.

"వొస్తాను...కాని మంచి స్కాచి ఉండాలి." అన్నాడు సూపరెంటు.

"సారీసార్! నాకు మద్యం ఇవ్వడమూ పుచ్చుకోవడమూ పడదు. మీకు తెలుసును కదా!" అన్నాడు ఆనంద్ ఖచ్చితంగా.

"నిజం. నిజం. ఊరికినే అన్నాన్లే. తప్పకుండా వొస్తాను" అన్నాడు. సూపరెంటు. ఆయన భోజనప్రియుడూ మద్యప్రేమికుడూను. కాని అవి ఉచితంగా వొస్తేనే.

ఆరోజు ఇంటికి వెళ్ళాలనిపించలేదు. పూర్వం అయితే అయిదుగంటలు కొట్టగానే లేచి సైకిలు తీసుకుని ఇంటికి బయలుదేరేవాడు ఆనంద్. కాని ఈరోజు ఆరుదాకా ఉండిపోయి పేరుకున్న కాగితాలమీద పనిచేస్తూ గడిపేడు అతను.

"ఇవేళ పడమట సూర్యోదయం అయింది" అన్నాడు అది గమనించిన డేనియెల్.

"నా కళ్ళని నేనే నమ్మలేకుండా ఉన్నాను" అన్నాడు పుండరీకాక్షుడు.

"చాలా పని మిగిలిపోయింది" అన్నాడు సిగ్గుపడుతూ ఆనంద్.

"పని ఉంటూనే ఉంటుంది" అన్నాడు డేనియల్.

"కొత్త కాపురం! ఇంట్లో అమ్మాయి ఎదురుచూస్తూ ఉంటుంది! ఆ కాగితాలు మేం చూసుకుంటాం. నువ్వు వెళ్ళు" అన్నారిద్దరూ.

"ఆవిడ-ఇక్కడ లేదు. పుట్టింటిలో ఉంది" అన్నాడు మరింత సిగ్గుపడుతూ ఆనంద్.

"అదేమిటి?" అన్నాడు పుండరి.

"మామగారికి ఒంట్లో బాగులేదు."

డేనియల్ పుండరీ ఒకరి ముఖం ఒకరు చూసుకుని నవ్వేరు. చివరికి పుండరీ "అవునూ- నీకిన్ని సూత్రాలు ఉన్నాయి. కట్టుబడి ఉండటం మాకు తెలుసును. కాని..." అన్నాడు.

ఆనంద్ అనుమానంగా చూశాడు. ఎవ్వరు ఏమన్నా అతను భరించగలడు కాని సూత్ర విరుద్ధంగా ప్రవర్తించాడంటే మాత్రం చాలా బాధపడిపోతాడు. కోపం వచ్చేస్తుంది.

"ఏమిటి?" అన్నాడు ఆనంద్.

"ఏమీలేదు. మాలాటివాళ్ళకు తప్పదు కాని చక్కటి వయసులో మిసమిసలాడుతూన్న మీరు వేరుగా ఉండటం ఏమిటమ్మా?" అన్నాడు పుండరి.

"చెప్పేనుగా! అక్కడ ఉంది. వారంలో వొస్తుంది" అన్నాడు ఆనంద్

"భర్త దగ్గర భార్యా అవసరమైనప్పుడు భార్యదగ్గర భర్తా ఉండడం న్యాయం!" అన్నాడు డేనియల్.

ఆనంద్ జవాబియ్యలేదు. కష్టంగా నవ్వి టేబిలు సర్ది బయటికి వెళ్ళి సైకిలెక్కేడు. తనకి విజయతో ఉండాలనే ఉంది. ఆ కోరిక ఇంతా అంతా కాదు. కాని పరిస్థితులలాటివి! వీళ్ళకేం తెలుసును?

ఆమె ఆలోచనలే అతని మనసు నిండా.

బరువుగా సైకిలు తొక్కుకుంటూ ఇంటికి చేరేడు. అమ్మ గుమ్మంలో కూర్చుని ఆత్రంగా ఎదురుచూస్తోంది. నాన్న భాగవతం చదువుకుంటున్నాడు.

"ఇంతాలశ్యం ఏమిరా?" అంది.

"ఆఫీసులో పని" అన్నాడు ఆనంద్

ఇల్లంతా మరీ శూన్యంగా కనిపించింది. ఉదయం సమయంలోకన్నా సాయంత్రాలు ఒంటరితనం ఎక్కువ బాధపెడుతుంది కాబోలు!

కాఫీ తాగి రీడింగ్‌రూముకి వెళ్ళాడు. అక్కడా అందరూ అతనికి దొరికిన అదృష్టాన్ని గురించే పొగిడారు. అతనింకా ఉద్యోగంలోనే ఉన్నాడని విని అందరూ యథాశక్తి ఆశ్చర్యపడ్డారు. కాని తన సూత్రాలని గురించి ఆనంద్ వాళ్ళకి జ్ఞాపకంచేశాక అందరూ అతన్ని మెచ్చుకున్నారు.

సరీగా ఎనిమిదింపావుకి ఇంటికొచ్చి భోజనం చేశాడు ఆనంద్. తల్లి అతనికి వెండి కంచంలో భోజనం పెట్టింది. వెండి గ్లాసులో నీళ్ళు ఇచ్చింది. తరువాత మరో వెండి గిన్నెలో మీగడపాలు ఇచ్చింది. ఒక్కొక్కటి చూసి ఆనంద్ ఆశ్చర్యంగా "ఇదేమిటమ్మా?" అన్నాడు.

"పెళ్ళికి వెండిపళ్ళేం ఇవ్వర్రా?" అంది తల్లి.

అన్నీ అయాక కట్నం తీసుకోకపోయినా ఇవన్నీ తప్పవు కదా! అనుకుని సమాధానపడ్డాడు ఆనంద్.

బెడ్‌రూమ్‌లో కొత్త ఫోమ్‌బెడ్ మీద పడుకోగానా ఆనంద్‌కి చాలా సుఖం అనిపించింది. మొదట అతను ఆ మంచానికీ అభ్యంతరం చెప్పేడు. కాని విజయ చాలా బాధపడిపోయి "మరి నా వస్తువులు నేను తెచ్చుకోవద్దా? మీరేమో కట్నం గిట్నం పనికిరాదన్నారు కదా!




అయినా ఇవన్నీ మనవే. ఒకరిచ్చారని ఎందుకనుకోవాలి?" అంది. రెండు బీరువాలనిండా ఆమెవీ అతనివీ బట్టలూ ఈ మంచముతో గది అంతా కిక్కిరిసిపోయి ఉంది. కాని విజయ ఆ గదిలోకి రాగానే అతనికి ఊపిరి ఆడడం కష్టమైంది. చాలా ఆలోచనలు వెనక్కి వెళ్ళిపోయాయి.

ఆ మంచంమీద పడుకుంటే అతనికి ఏమిటో లోకం అంతా శూన్యం ఐపోయినట్టు ఉంది! ఈ వారం ఎలా గడుస్తుందో అనిపించి బెంగగా ఉంది.

ఆ వారం ఎలా గడిచిందో అతనికే తెలీదు. ఏదో తిన్నాడు. యాంత్రికంగా ఆఫీసుకి వెళ్ళి వొచ్చాడు. ఇంట్లో పార్టీ ఇచ్చినరోజు అంచరూ బాగా తిన్నారు. ప్రశంసావాక్యాల వర్షంలో అతను తడిసిపోయాడు. చివరికి లేడీటైపిస్టు కూడా విజయ ఫొటో తదేకంగా చూసి చూసి ఆమెని పది నిముషాలపాటు పొగిడింది.

ఆఫీసులో అతనికి మర్యాద ఎక్కువైంది.

"వెళ్ళి తీసుకురా" అంది అమ్మ.

"తనే వొస్తుందిలే" అన్నాడు.

"ఎప్పుడూ?" అంది అమ్మ.

"తొందరేమిటి?" అన్నాడు ఆనంద్.

"నేనూ నాన్నా మూడునెలలు తీర్థయాత్రలకి వెడతాము! టికెట్ కొనుక్కున్నాం మరిచిపోయావా?" అంది ఆవిడ.

అవును మొన్న అలాటి మాటలేవో అంది: కాని ఇంత స్పష్టంగా చెప్పినట్టు లేదే!

"అలాగేలే! కొంతకాలం పోనీ" అన్నాడు ఆనంద్. అమ్మ వెళ్ళిపోతానంటే అతనికి బెంగగా ఉంది.

"వొచ్చే త్రయోదశినాడు ప్రయాణం. అమ్మాయికి ఒక ఉత్తరమైనా రాసి పడెయ్యి. ఇంక నిన్ను తనే చూసుకోవాలి- నా డ్యూటీ అయిపోయింది. రామా కృష్ణా అనుకుంటూ ఏ కాశీలోనో హరిద్వార్‌లోనో గడుపుతాం."

"అదేం వొద్దులే-కావలిస్తే ఓ వారం రోజులు తిరిగిరండి గాని ఎక్కువ రోజులు వెళ్ళిపోతానంటే కుదరదు" అన్నాడు ఆనంద్.

"ఏం?" అంది అమ్మ నవ్వుతూ.

"నాకు బాగుండదు" అన్నాడు ఆనంద్.

"డబ్బు గురించి బెంగపడకు -ఇల్లు తాకట్టు విడిపించేను" అంది అమ్మ. అదిరిపడ్డాడు ఆనంద్.

"అదెలాగ?" అన్నాడు. కాని అతనికి జవాబు వెంటనే తెలిసింది ఆమె చెప్పకుండానే. "నీమాటే కానీరా! పిల్ల నచ్చితే మిగిలిన మాటలు నాకు వదిలీ? నువ్వేం కట్నం తీసుకోవద్దులే" అంది అమ్మ. నాన్న మాట్లాడడు.

ఇంకా వివరాలు అడుగుదామని అతననుకుని భయపడి ఆ ప్రయత్నం మానేశాడు. అమ్మమీద కోపం వొచ్చింది. ఆ వెంటనే అనలేదు. కాని...

ఆ కోపంలో ఒకరోజు సెలవుపెట్టి ప్రయాణ సన్నాహం చేసుకున్నాడు.

"త్వరగా అమ్మాయిని తీసుకురా!" అంది అమ్మ.

"అక్కడికి వెడుతున్నానని చెప్పలేదు" అన్నాడు ఆనంద్ బింకంగా.

"చెప్పక్కరలేదులే!" అంది. అమ్మ స్వీట్స్ చేసి ఇచ్చింది.

పిలవకుండా 'అక్కడికి' వెళ్ళాలని అనిపించలేదు అతనికి. "మన పిల్లని మనం తెచ్చుకునేందుకు వాళ్ళు పిలుపెందుకురా? ఉన్నది ఒక్క పిల్ల. ఎన్నాళ్ళు ఉన్నా పంపాలని వాళ్ళకి అనిపించదు. మనమూ ఊరుకుంటే ఎలాగ" అంది అమ్మ.


ఒక టెలిగ్రాం కొట్టి బయలుదేరాడు ఆనంద్. ఆ పద్ధతి సర్వసమ్మతంగా కనిపించింది అతనికి.

రైలు దిగేసరికి బావమరిదీ నౌకరూ సిద్ధంగా ఉన్నారు. ఇద్దరూ ఆప్యాయంగా కుశలప్రశ్నలు వేశారు. విజయ మాట అడుగుదామనిపించీ అడగలేకపోయాడు. మామగారి గురించి అడిగేడు.

"అలాగే ఉన్నారు. ఏవో తన వ్యవహారాలు చూసుకుంటూనే ఉన్నారు- అమ్మాయిమీద బెంగ. అంతకన్నా ఏమీలేదు" అన్నాడు బావమరిది.

అతని కోసం కేటాయించిన గదిలోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి కూర్చున్నాడు ఆనంద్. ఇంతసేపూ విజయ కనిపించకపోవడం అతనికి ముళ్ళమీద కూర్చున్నట్టు ఉంది. మామగారు వొచ్చి పలకరించారు. బావమరుదులు ఒకటి రెండుసార్లు వొచ్చి మాట్లాడేరు. ఆమె మాత్రం రాలేదు.

క్షణక్షణానికీ ఆనంద్‌లో ఆత్రం ఎక్కువై అతని ఓర్పు తగ్గిపోతూ ఉంది. ఈ పెద్ద ఇంటిలో వెళ్ళి ఎవరినైనా అడగడం సాధ్యమయేపని గాదు. బావమరిదిని అడగడానికి బిడియంగా ఉంది. ఈసారివొస్తే అతన్ని అడగాలి.




ఎనిమిదిన్నర అవుతూంటే బ్రేక్‌ఫాస్టుకి రమ్మని పిలవడానికి ఆమె తమ్ముడు వొచ్చాడు. తన ప్రశ్నని వాయిదావేసి ఆనంద్ వెళ్ళాడు. అతను అనుకున్నట్టుగానే విజయ అక్కడ కనిపించింది.

అత్తగారు అతనికి స్వాగతం చెప్పింది. విజయవంక చూస్తూ "అమ్మాయి నిన్ను పలకరించడానికి వొద్దామనుకుంది కాని సిగ్గుపడి పోయింది" అంది.

విజయ కళ్ళు బరువుగా దింపుకుంది. ఈ కొద్దిరోజులలోనే ఆమె తనకి అంత దూరంగా అయిపోవడం ఆనంద్‌కి బాధ కలిగించింది.

"ఆపిల్ల ధైర్యమంతా బయటికే! అమ్మనీ నాన్ననీ వొదిలివెళ్ళడం అంటే బెంగపెట్టుకుంది" అంది సగం గంభీరంగా సగం చిరునవ్వుతోనూ అత్తగారు.

"కాని పెళ్ళిచేసుకున్నాక తప్పదు కదా!" అన్నాడు ఆనంద్ విజయని క్రీగంట చూస్తూ.

"తప్పిస్తే తప్పడానికేముంది?" అంది అత్తగారు. ఆమె చాలా ఘటికురాలని వినడమే కాని ఇప్పటిదాకా గమనించలేదు ఆనంద్.

విజయ ఏమైనా అంటుందేమోనని చూశాడు. ఆమె తల వొంచుకుని ప్లేటు గెలుకుతోంది. అప్పటికన్నా చిక్కిపోయిందని ఆనంద్‌కి అనుమానం కలిగింది,

ఒకరూ ఒకరూ తినడం ముగించి వెళ్ళిపోయారు.

అతనూ విజయ టేబిల్ దగ్గర మిగిలేరు.

కొద్ది నిమిషాలు ఇద్దరూ కదలకుండా కూర్చున్నారు. ఇద్దరి మనసుల్లో కల్లోలంగా ఉన్నాయని వాళ్ళకి తెలుసును.

విజయ లేచి రెండడుగులు వేసి ఆగి "రండి-కొంచెం సేపు గార్డెన్‌లో తిరిగి వద్దాం" అంది.

అతనామెని అనుసరించాడు. ఇంటి చుట్టూ పెద్ద తోట ఉంది. ఒక చెట్టుకింద వాళ్ళిద్దరూ నిలబడ్డారు.

గొంతుక ఎండిపోయినట్టు ఉంది అతనికి.

"మీ ఇష్టం" అంది విజయ.

ఆనంద్ ఆమె చేతిని తన చేతిలో తీసుకున్నాడు. తన భార్యకి తాను దగ్గరగా ఉండాలన్న తన కొత్తసూత్రాన్ని అమలులో పెడుతూ అతను వీలైనంత దగ్గరగా వెళ్ళబోయేడు.

"లోపలికి పోదాం." అంది విజయ అతన్ని వారిస్తూ,

బరువైన అడుగులతో ఇద్దరూ లోపలికి వెళ్ళాక అతని కొత్త సూత్రాన్ని విజయ అర్థంచేసుకున్నట్టు కనిపించింది.

కొంచెంసేపటి తరువాత అతను "మనం త్వరలో వెళ్ళిపోవాలి విజయా ఎప్పుడో చెప్పు" అన్నాడు.

"మీ ఇష్టం. కాని ఇక్కడ బాగుండ లేదా?" అంది విజయ.

"బాగుంది. కాని ఎక్కడివాళ్ళు అక్కడ ఉండాలి కదా! అక్కడ నా ఇల్లూ ఉద్యోగం ఉన్నాయి" అన్నాడు ఆనంద్.

"ఈ ఇల్లూ మీదే! ఉద్యోగం మీక్కావాలంటే గంటల్లో వొస్తుంది... కాని మీ ఇష్టం" అంది విజయ.

అమ్మమాట గొంతులోనే ఆగిపోయిందతనికి.

"కాని అలాగ చెయ్యడం నా సూత్రాలకి విరుద్ధం" అన్నాడు అనంద్. ఆ మాటల్లో బలం లేదు. అమ్మ ఎంత పుచ్చుకుందో మరి!

"మీ సూత్రాలని గౌరవిస్తాను. కాని నన్ను సుఖపెట్టడం మీ సూత్రాలలో లేదా?" అంది చిరునవ్వుతో కవ్విస్తున్న కళ్ళతో విజయ.

చాలా చాలా ఆలోచించి "ఉంది" అన్నాడు ఆనంద్. ఆమె మెత్తటి వెచ్చదనం అతని ఆలోచనలని సరిగా సాగనివ్వలేదు.

"మీ ఇష్టంవొచ్చినట్టు చేయండి... మీరు నా దగ్గరగా ఉంటే నాకు చాలు" అంది విజయ,

ఆ మధ్యాహ్నం ఆనంద్ సెలవు పొడిగిస్తూ టెలిగ్రాం ఇచ్చాడు.

"వాళ్ళు కాదంటారేమో!" అంది విజయ.

"అంటే అననీ. అంతకన్న మంచి ఉద్యోగం దొరికింది గదా!"

"ఏమిటది?"

"నిన్ను చూస్తూ కూర్చోడం!"

ఎవరో ఎయిర్ గన్ పేల్చేరు.

బయట చెట్టుమీది పక్షులు ఒక్కసారి లేచి ఎగిరాయి. అవి అతని సూత్రాలాగ ఉన్నాయి. అవన్నీ గమనించలేదు ఆనంద్. అతను ఒక కొత్త లోకంలో ఉన్నాడు.

*